సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



అన్నప్రసాద భవనానికి విరాళాలు

కొత్తపేట: వాడపల్లిలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ఎస్.వెంకటేశ్వరరావు, (ఆర్యవటం) రూ.51,116, ఎన్.గిరిబాబు (పెనుమంట్ర) రూ.50,116 విరాళాలుగా ఇచ్చారు.



కళకాలం నిలిచేలా..

ఎప్పుడూ పుస్తకాల్లోని పాఠాలు చదువుతూ బిజీగా ఉండే విద్యార్థులు తమలోని ప్రతిభను బయటకు తీశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటి శభాష్ అనిపించుకున్నారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం రాత్రి 3,37,621 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా కలెక్టర్‌గా కీర్తి చేకూరి

– ప్రశాంతి బదిలీ



సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్‌గా కీర్తి చేకూరి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కీర్తి చేకూరి ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా (సంక్షేమం) విధులు నిర్వర్తించారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న పి.ప్రశాంతిని బదిలీ చేశారు. ఆమె తాను పనిచేసిన ఏడాదిలో ఉత్తమ కలెక్టర్‌గా ప్రజల మన్ననలు పొందారు. అక్రమ ఇసుక దందాపై ఉక్కుపాదం మోపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, అవినీతి రహిత పాలనకు విశేషంగా కృషి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ పనినైనా, ఎవరు సిఫారసు చేసినా తిరస్కరించేవారు.

వరిలో సస్య రక్షణ చేపట్టాలి



కొవ్వూరులో ఖరీఫ్ వరి చేలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

తాళ్లపూడి (కొవ్వూరు): ప్రస్తుతం ఖరీఫ్ వరి రకాల పనితీరు, పంట ఎదుగుదల, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. కొవ్వూరులో గురువారం ఖరీఫ్ వరి పంటలను ఆయన పరిశీలించారు. ఎంటీయూ 7029, ఎంటీయూ 1318, పీఎల్ఏ 1100, విత్తనం కోసం వేసిన ఎంటీయూ 1121 రకాలు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ వరి పంట చీడ పీడలు లేకుండా ఆరోగ్యంగా ఉందన్నారు. వరిలో పిలక, అంకురం దశల్లో కాండం తొలిచే పురుగు తల్లి పురుగులు, గుడ్ల సముదాయాలు కన్పిస్తున్నట్లు తెలిపారు. నివారణకు ఎకరాకు క్యార్బొఫ్యూరాన్ 3 జి గుళికలు 10 కిలోల చొప్పున వేయలి లేదా ఎసిఫెట్ 1.5 గ్రా. లేదా క్లోరన్ట్రనిలి ప్రోల్ 0.3 మి. లీ. లేదా కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2.0 గ్రా.లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలన్నారు. క్యార్బొఫ్యూరాన్ గుళికలను బురద పదునులో వేసి, తదుపరి పలుచగా నీరు పెట్టాలన్నారు. ఇటీవల వర్షాలకు మాగుడు తెగులు కన్పిస్తోందని, నివారణకు, హేక్సకొనాజోల్ 2.0 మి.లీ. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్త డా. మానుకొండ శ్రీనివాస్, కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి గంగాధర్ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి స్ఫూర్తి పథం : కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కలెక్టర్ ప్రశాంతి 'స్ఫూర్తి పథం' అనే వినూత్న కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ప్రారంభించారు. జిల్లాలోని 213 ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. క్రమశిక్షణ, స్థితప్రజ్ఞత, విశాల దృక్పథం, సామాజిక స్పృహను పెంపొందించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. సెల్‌ఫోన్ల వల్ల చదువుపై దృష్టి తగ్గడం, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో స్వామి వివేకానంద బోధనలు విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తాయని చెప్పారు. 'బలమే జీవనం, బలహీనతే మరణం' అన్న వివేకానంద సందేశాన్ని గ్రహించి విద్యార్థులు బలహీనతను వదిలి ధైర్యంతో, లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. 'స్ఫూర్తి పథం' కార్యక్రమంలో భాగంగా 20వ తేదీ నుంచి ప్రతి శనివారం రామకృష్ణ మిషన్ స్వామీజీలు విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఇస్తారన్నారు. విద్యార్థులను ఉద్దేశించి రామకృష్ణ మిషన్ స్వామి పరిజ్ఞేయానందజీ, మహారాజ్ , స్వామి సేవ్యానందజీ మహారాజ్ ప్రసంగించారు. జిల్లా పాఠశాల విద్యాధికారి డి.వాసుదేవరావు, జిల్లాలోని 213 పాఠశాలల విద్యార్థులు వెబ్ ఎక్స్ ద్వారా పాల్గొన్నారు.

మనమే ప్రథమం

రాజమహేంద్రవరం రూరల్: ''స్వర్ణ ఆంధ్ర విజన్–2047'' కార్యక్రమంలో 92 శాతం పనితీరు సాధించి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పిల్లలకు పూర్తి టీకాలు అందించడం, శిశు మరణాల రేటు తగ్గుదల, నవజాత శిశు మరణాల రేటు తగ్గింపు, ఐదేళ్ల లోపు పిల్లల మరణాల రేటు తగ్గింపు, మాతృమరణాల రేటు తగ్గుదల, గర్భిణులలో రక్తహీనత నివారణ, జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సాకర్యాల కల్పన వంటి కీలక పనితీరు సూచికల్లో జిల్లా ఏప్లస్ రేటింగ్ సాధించిందన్నారు.



సాక్షి ఎడిటర్‌పై కేసు సరి కాదు

రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడిన మాటలను ప్రచురించినందుకు 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదు. పత్రికలో వచ్చిన వార్తపై అభ్యంతరాలు ఉంటే ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చు. లేదా ఖండన ఇవ్వొచ్చు. కక్షపూరితంగా వ్యవహరించడం దుర్మార్గం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, తూర్పుగోదావరి





పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

ప్రజాస్వామ్యంలో ఉన్న పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోంది. సాక్షిలో నిజాలను నిర్భయంగా రాస్తే కేసులు పెడతారా? ఒక నాయకుడు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌ను పత్రికలో పబ్లిష్ చేస్తే కేసులు పెట్టడం విడ్డూరంగా ఉంది. ప్రచురించిన వార్తలో అభ్యంతరాలు ఉంటే ఖండన లేదా వివరణ ఇవ్వాలి కాని ఎడిటర్, ఎడిషన్ ఇన్‌చార్జిలు, పత్రిక ప్రతినిధులపై కేసులు పెట్టడం దారుణం. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్య్రం హక్కు లేదా?

– తానేటి వనిత, రాష్ట్ర మాజీ హోం మంత్రి

భ్రాంతి భద్రతలు భేష్!

- జిల్లాలో కట్టు తప్పుతున్న శాంతిభద్రతలు
- పోలీసులపైనే దాడులకు తెగబడుతున్న రౌడీషీటర్లు
- రాత్రిళ్లు తప్పతాగి గొడవలు, దోపిడీలు
- శ్రుతిమించుతున్న ఆగడాలు
- చారిత్రక రాజమహేంద్రిలో అసాంఘిక ఘటనలు
- అశ్లీల నృత్యాలు, యథేచ్ఛగా మద్యం, పేకాట
- కఠినంగా వ్యవహరిస్తున్నామంటున్న పోలీసులు



నల్లజర్ల మండలంలో అశ్లీల నృత్యాలు చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు (ఫైల్)



రాజమహేంద్రవరంలో కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న రౌడీ షీటర్

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లాలో శాంతిభద్రతలు కట్టుతప్పుతున్నాయా? రౌడీ షీటర్ల ఆగడాలు శ్రుతిమించుతున్నాయా? రోడ్లపైనే మద్యం తాగి దాడులు, దోపిడీలకు పాల్పడుతున్నారా? నడిరోడ్లపై కొట్లాటలు సాగుతున్నాయా? గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోందా? యథేచ్ఛగా పేకాట శిబిరాలు జరుగుతున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తోంది. అశ్లీల నృత్యాలు, రేవ్ పార్టీలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు కొందరు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఏడాదిగా జిల్లాలో చోటు చేసుకుంటున్న ఘటనలే తార్కాణం. వాటి వివరాలు ఇలా..

- దివాన్‌చెరువు పెట్రోల్ బంక్ సమీపంలో లారీ ఆపి డివైడర్‌పై పడుకొని ఉన్న లారీ డ్రైవర్‌పై తెల్లవారు జామున నాలుగు గంటలకు ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.20,000 నగదు, సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయారు. అతనిపై తీవ్రంగా దాడి చేయడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. 112 ద్వారా అందిన సమాచారం మేరకు పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.
- ఇటీవల రాజమహేంద్రవరం తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డులో క్రైమ్ పోలీసులం అని చెప్పి సీతంపేటకు చెందిన 67 ఏళ్ల వృద్ధుడి వద్ద 9 గ్రాముల బంగారపు ఉంగరాలు లాక్కుని వెళ్లిపోయారు.
- ఇటీవల కొవ్వూరు వెళ్లాలని వేచి చూస్తున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు ఏమార్చాడు. కొవ్వూరు తీసుకెళ్తానని వాహనం ఎక్కించుకుని కొంతదూరం వెళ్లాక అతని వద్ద ఉన్న డబ్బు లాక్కొని పరాయయ్యాడు.
- నల్లజర్ల మండలంలోని ఘంటావారిగూడెం గ్రామశివారులో గుణ్ణం సురేష్‌కు సంబంధించిన రిసార్ట్(కొబ్బరితోట)లో అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలకు తెర తీశారు. బర్త్‌డే పార్టీ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యూ ఆకారంలో టేబుల్స్ పెట్టుకుని మద్యం సేవిస్తూ.. ఉండగా మధ్యలో యువతులు అశ్లీల నృత్యాలు చేస్తున్నారు. విషయం పోలీసులకు తెలియడంతో రాత్రి 11 గంటల సమయంలో దాడి చేశారు. ఇతర జిల్లాలకు చెందిన నలుగురు డ్యాన్సర్లు, 24 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాలుగు మద్యం బాటిళ్లు, రూ.10 వేల నగదు, 6 కార్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ఉంగుటూరుకు చెందిన నాయకుడు తన పుట్టినరోజు వేడుకకు ఇదే తరహాలో పార్టీ ఏర్పాటు చేయగా పార్టీ మధ్యలో పోలీసులు దాడి చేశారు. అయినా పరిస్థితి మారలేదంటే పోలీసుల పహరా ఎలా ఉందో అర్థం అవుతోంది.

రాజమహేంద్రవరంలో బరి తెగింపు

ప్రశాంతంగా ఉండే చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో రౌడీ మూకలు బరి తెగిస్తున్నాయి. బ్లేడ్ బ్యాచ్, మందు బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లుగా ప్రతి రోజూ రాత్రిళ్లు హల్‌చల్ చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. రాత్రివేళ్లల్లో నడిరోడ్లపైనే గొడవలకు దిగుతున్నారు. ప్రజలకే కాదు నైట్ బీట్ నిర్వహించే పోలీసులకు కూడా రక్షణ కరవైంది. ఎందుకు గొడవలు చేస్తున్నారని ప్రశ్నించిన పోలీసులు పైనే దాడులకు తెగబడుతున్నారు. బరి తెగిస్తున్న రౌడీషీటర్ల చేష్టలకు పోలీసులు నివ్వెర పోతున్నారు. చివరకు పోలీసులు ఏమీ చేయలేక రౌడీషీటర్ల చేతిలో తన్నులు తింటున్న ఘటనలు భయాందోళనలకు గురి చేస్తున్నాయి.

పోలీసులపైనే దాడులు

రాజమహేంద్రవరంలో ఇటీవల ఓ రౌడీ బ్యాచ్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ పైనే దాడికి తెగబడింది. రాత్రి గస్తీ తిరుగుతున్న కానిస్టేబుల్ నాగబాబు, హోమ్ గార్డ్ కాశీలు.. రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న ముగ్గురు యువకులను ఈ టైం లో తిరగకూడదని చెప్పారు. ఇంటికి వెళ్లండని హెచ్చరించారు. దీంతో.. మద్యం సేవించిన ఆ యువకులు మీరేంటిరా చెప్పేదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా.. మాతోనే పెట్టుకుంటారా..? అంటూ పోలీసులపై చేయి చేసుకున్నారు. పోలీసు లాఠీని లాక్కుని, ఎంత వారిస్తున్నా పట్టించుకోకుండా విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ని చితకబాదారు. ఈ ఘటన సర్వత్రా సంచలనం రేకెత్తించింది. ఈ దాడి ఘటన వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖ ఘటనను సీరియస్‌గా తీసుకుంది. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాలతో వెంటనే దాడి చేసిన యువకుల కోసం ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేసి 24 గంటలు తిరక్కుండానే అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. ఏది ఏమైనా పోలీసులపైనే తిరగబడ్డారంటే పరిస్థితి ఎంత వరకు వచ్చిందో అర్థం అవుతోంది.

తెలియకుండా మరికొన్ని...

రాజమహేంద్రవరం నగరంలో తెలిసినది ఈ ఘటన అయితే పోలీసుల దృష్టికి రాకుండా మరెన్నో జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. గంజాయి, మద్యానికి బానిసలైన ఆకతాయి యువకులకు కొందరు రౌడీషీటర్లు ఆశ్రయం ఇస్తున్నారు. వారిని అక్రమ వ్యవహారాలు, వివాదాలు, సెటిల్‌మెంట్లకు వాడుకుంటున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే కొందరు యువకులు అర్ధరాత్రి దాటిన తర్వాత కొన్ని జంక్షన్లు, నగర శివారు ప్రాంతాలను తమ అడ్డాలుగా చేసుకుని మద్యం బాటిల్స్‌తో రోడ్లపైనే హల్‌చల్ చేస్తున్నారు. కొందరైతే దారిన పోయే వారితో గొడవలకు దిగుతున్నారు. వారి నుంచి విలువైన వస్తువులు దోచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. వీరిపై ఫిర్యాదు చేస్తే.. ఎక్కడ తమపై దాడి చేస్తారో అన్న భయంతో అనేకమంది పోలీస్ స్టేషన్ గడప తొక్కడం లేదన్న విమర్శలున్నాయి.

కౌన్సెలింగ్ ఏదీ?

గతంలో ప్రతి నెలా రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చేవారు. పోలీసుల దెబ్బకు అణిగిమణిగి ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కౌన్సెలింగ్ నిర్వహించిన దాఖలాలు లేవు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో రౌడీ షీటర్లు పేట్రేగిపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రాజకీయ పైరవీలకు తలొగ్గి కేసులు కట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించం. జిల్లాలో పోలీసులు సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారు. గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా డ్రోన్ ద్వారా నిఘా పెట్టాం. రెండు రోజుల్లో బహిరంగంగా మద్యం తాగే వారిని గుర్తించి 300 కేసులు నమోదు చేశాం. రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేస్తున్నాం. నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు మద్యం షాపులు నడుపుతున్న యజమానులు, రాత్రి సమయాల్లో తాగి రోడ్లపై తిరిగే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నాం. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి న్యాయం చేస్తున్నాం. అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా గణపతి నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించాం.

– డి.నరసింహ కిషోర్, ఎస్పీ, తూర్పుగోదావరి

ఫీజు రీయింబర్స్ చేయాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. సంఘ జిల్లా విస్తృత స్థాయి సమావేశం స్థానిక రవణం శ్రీరాములు మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. దీనికి హాజరైన రామ్మోహన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు, యువత ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటంలోకి వస్తున్నారన్నారు. హాస్టల్స్‌కి సొంత భవనాలు నిర్మించాలని, మరమ్మతులకు నిధులు కేటాయించాలని, మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని, జీఓ నెంబర్ 77 రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకుండానే ముందస్తుగానే ఫీజులు కట్టమని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. రంగంపేట మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కొవ్వూరు డిగ్రీ కళాశాల భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

– పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

సాక్షి, రాజమహేంద్రవరం: లిక్కర్ అక్రమ కేసులో మధ్యంతర బెయిల్‌పై వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డి తిరిగి గురువారం మధ్యాహ్నం 4.35 గంటలకు సెంట్రల్ జైల్లో సూపరింటెండెంట్ ఎదుట హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం వచ్చారు. తొలుత వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్‌లోని వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయాన్ని సందర్శించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆయన వెంట వచ్చారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు పూలు జల్లి, శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి మంజీర హోటల్‌కు చేరుకుని అక్కడ జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్, మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావ్, జి.శ్రీనివాసులనాయుడు, సత్తి సూర్యనారాయణరెడ్డి, పొన్నాడ సతీష్, పాముల రాజేశ్వరి, జ్యోతుల చంటిబాబు, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షర్మిలారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, మాజీ ఎంపీ వంగా గీత, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిలు జి.శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఎంపీ మిథున్‌రెడ్డికి నేతలందరూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న టీడీపీ

రాజమహేంద్రవరం సిటీ: బీసీలను తెలుగుదేశం ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ ఎంపీ జీ.వి. హర్షకుమార్ ఆరోపించారు. గురువారం రాజమహేంద్రవరంలో రాజీవ్‌గాంధీ కళాశాల సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, కాని సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ అట్టహాసంగా సభ జరిపి ఒకరినొకరు పొగుడుకోవడమే సరిపోయిందని ధ్వజమెత్తారు. హామీల అమలులో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఉచిత ఇసుక ప్రజలకు అందడం లేదని ఎమ్మెల్యేలకు ఆదాయ వనరుగా మారిందన్నారు. చేనేత కుటుంబాలకు రూ.20 వేలు, హజ్ యాత్రకు రూ.లక్ష సాయం, డ్రైవర్లకు రూ.15 వేలు, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేలు, పత్తి రైతుకు బిందు సేద్యం రాయితీ ఇవ్వలేదన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ.10 లక్షల రుణాలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలేదని హర్షకుమార్ ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తే చంద్రబాబు పదవికి ఇబ్బంది తప్పదని హెచ్చరించారు. కులగణన చేపట్టాలని కోరారు.

జీపీఎస్ ఉన్న వాహనాలతోనే ధాన్యం తరలింపు

జిల్లా సేకరణ కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అక్టోబర్ రెండో వారం నుంచి ఖరీఫ్ వరి ధాన్యాన్ని సేకరించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 2025– 26 ఖరీఫ్ వరి ధాన్య సేకరణ సన్నద్ధతపై జిల్లా సేకరణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రేడ్ ఏ రకానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి క్వింటాకు రూ.2,369 కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. గత సీజన్‌తో పోలిస్తే కనీస మద్దతు ధర రూ.69 పెరిగిందన్నారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఖరీఫ్‌లో 5,31,616 మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి కానుందని చెప్పారు. ధాన్యం సేకరణకు సిబ్బంది కొరత లేకుండా చూడాలని, అవసరమైతే నియామకం చేపట్టాలని సూచించారు. ఈ నెలాఖరుకల్లా ఈ పంట, ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు. మిల్లులు సిద్ధంగా ఉన్నాయని సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. మిల్లుల టాగింగ్, తనిఖీపై దృష్టి సారించాలన్నారు. ధాన్యం తరలించే వాహనాలన్నిటికీ జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గోతాముల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గత సీజన్లో మిల్లులకు 3,54,903 మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా, 2,28,806 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే వారి నుంచి వచ్చిందని, ఇంకా 10,781 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందని దీనిని త్వరితగతిన రికవరీ చేయాలని ఆదేశించారు. ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి. పార్వతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి రూ.35,62 లక్షల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి హుండీల ద్వారా రూ.35,62,444 ఆదాయం సమకూరింది. ఈ ఏడాది జూన్ 20 నుంచి సెప్టెంబర్ 11 వరకూ 83 రోజులకు గాను ఈ మొత్తం సమకూరింది. దేవదాయశాఖ జిల్లా అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కింపు చేపట్టారు. మొత్తం ఆదాయంలో మెయిన్ హుండీల ద్వారా రూ.35,07,678, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ నుంచి రూ.14,679, అన్నదానం హుండీల ద్వారా రూ.40,087 లభించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. అలాగే 4 గ్రాముల బంగారం, 39 గ్రాముల వెండి లభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్ బాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వినాయకునికి వెండి పళ్లెం సమర్పణ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి విశాఖపట్నం తగరపువలసకు చెందిన కటకం అవినాష్, సాహిత్య శృతి దంపతులు గురువారం వెండి పళ్లెం సమర్పించారు. 1050 గ్రాములు బరువైన ఈ పళ్లెం విలువ రూ.1,35,000 ఉంటుంది. దాతలు దీన్ని ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. అనంతరం వారిని ఆలయ అర్చకులు, వేద పండితులు సత్కరించి, స్వామివారి శేష వస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి


గోవరాజు (ఫైల్)

తాళ్లరేవు: జాతీయ రహదారిపై మట్ల పాలెం వంతెన వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వలిపూడి గోవరాజు (41) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పటవల పంచాయతీ కొత్తూరుకు చెందిన గోవరాజు రాత్రి సమయంలో రోడ్డు దాటుతుండగా యానాం వైపు నుంచి కాకినాడ వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవరాజు తలకు తీవ్ర గాయమైంది. అతడిని స్థానికులు హుటాహుటీన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోవరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


గుర్రం కొండలరావు (ఫైల్)

అల్లవరం: కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గుర్రం గంగాధర్ (బాబ్జి) తండ్రి కొండలరావు (100) గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని పలువురు రాజకీయ ప్రముఖులు, గ్రామస్తులు సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కళకాలం నిలిచేలా..

- డైట్‌లో కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 130 మంది విద్యార్థుల హాజరు


పోటీల విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు, అధ్యాపకులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


మృదంగం వాయిస్తున్న కార్తికేయ హిమాన్షు


గాత్రం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: ఎప్పుడూ పుస్తకాల్లోని పాఠాలు చదువుతూ బిజీగా ఉండే విద్యార్థులు తమలోని ప్రతిభను బయటకు తీశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటి శభాష్ అనిపించుకున్నారు. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణసంస్థ (డైట్)లో గురువారం కళా ఉత్సవ్ 2025 పేరిట జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు నిర్వహించిన పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం అంశాల్లో సోలో, గ్రూప్ విభాగాలలో పోటీలు జరిగాయి. వీటికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 35 పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సృజనాత్మకతకు వేదిక

ప్రారంభోత్సవంలో డైట్ ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు మాట్లాడుతూ విద్యార్థులలో దాగిన సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచి వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక పరిపక్వతకు, మనో వికాసానికి ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. శుక్రవారం సోలో(2డి), సోలో(3డి), గ్రూపు (2డి/3డి), థియేటర్ ఆర్ట్స్, సంప్రదాయ కథనాలకు సంబంధించి గ్రూపు విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు.

బహుమతుల ప్రదానం

తొలిరోజు జరిగిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు చేతులమీదుగా సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందజేశారు. వీరందరూ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా కేటీ సుబ్బరాయన్, ఎం.నాగేశ్వరరావు, డి. రవి కిరణ్ వ్యవహరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎం.రాజేష్, వి.శిరీష ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- గాత్రం వ్యక్తిగత విభాగంలో కె.షర్మిల, బృంద విభాగంలో ఎస్.సుమశ్రీ, ఆర్.భారతి, ఈ.నాగజ్యోతి, కె.శిరీష (అంబేడ్కర్ గురుకులం, ఏలేశ్వరం)
- వాయిద్యం వ్యక్తిగత విభాగానికి సంబంధించి స్ట్రింగ్‌లో టీవీకే దేవీ ప్రియాంక (భాష్యం స్కూల్, కాకినాడ), పెర్కషన్‌లో కె.కార్తికేయ హిమాన్షు (కలాం జూనియర్ కళాశాల, రాజమహేంద్రవరం).
- నృత్యం వ్యక్తిగత విభాగంలో సీహెచ్ హేమసత్య (చేబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల), బృంద విభాగంలో సీహెచ్ త్రిలోచన, పి.జ్యోతి లహరి, జి.చరణ్ సాత్విక్, ఎం.పవన్ కుమార్ (గాంధీపురం మున్సిపల్ హైస్కూల్, రాజమహేంద్రవరం).

మూతపడే దుస్థితికి చేనేత సంఘాలు


సమావేశంలో మాట్లాడుతున్న దొంతంశెట్టి సత్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: చేనేత సహకార సంఘాల నిధులన్నీ ఆప్కో బకాయిల రూపంలో స్తంభించిన కారణంగా సభ్యులకు ఉపాధి కల్పించలేని దుస్థితికి సంఘాలు చేరుకున్నాయని లివరీ ఫెడరేషన్ చైర్మన్ దొంతంశెట్టి సత్య ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. హసన్‌బాద చేనేత సహకార సంఘం భవనంలో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లివరీ చేనేత సహకార సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన సత్య ప్రకాశ్ మాట్లాడుతూ గడిచిన 10 నెలలుగా బకాయిలు పేరుకు పోయాయన్నారు. బ్యాంకుల నుంచి మంజూరు కాబడిన నిధులు పూర్తిగా వినియోగించుకోలేక పోవడంతో సంఘాల బ్యాంకు ఖాతాలన్నీ ఎన్‌పీఏలోకి వెళుతున్నాయన్నారు. కొన్ని సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఆప్కోకు ఎన్నికలు నిర్వహించి గాడిన పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హసన్‌బాద, ఆదివారపుపేట, శివల, అద్దంపల్లి, నేలటూరు, ముమ్మిడివరం, తమ్మవరం, మురారి, నల్లూరు తదితర చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

22 నుంచి పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలు


శరన్నవరాత్ర ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న పీఠాధిపతి గాడ్ తదితరులు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విజయదుర్గా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు గురువారం విలేకరులకు తెలిపారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) సమక్షంలో శరన్నవరాత్రి ఉత్సవ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 22న ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి రోజు ఉదయం 8.19 గంటలకు గురుహోరలో కలశ స్థాపన జరుగుతుందన్నారు. పీఠంలోని కొలువైన విజయదుర్గా అమ్మవారికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు.

అమ్మవారు దర్శనమిస్తారిలా..

ఈ నెల 22న బాలాత్రిపుర సుందరి, 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న రజిత కవచ అలంకృత విజయదుర్గాదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలిత త్రిపుర సుందరీదేవి, 28న విజయదుర్గాదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ ఒకటిన మహిషాసురమర్దని, 2న రాజరాజేశ్వరి అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పీఠాధిపతి గాడ్ సమక్షంలో అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి తదితరులు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. పీఠానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

భోజనం కోసం ఆగితే దోచేశారు

- ప్రైవేటు బస్సులో చోరీ
- తాళ్లూరులో దాబా వద్ద ఆపిన సమయంలో ఘటన
- 600 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు ఉన్న బ్యాగు మాయం

గండేపల్లి: జాతీయ రహదారిలో తాళ్లూరు వద్ద బుధవారం రాత్రి బస్సులో హైటెక్ చోరీ జరిగింది. 600 గ్రాముల బంగారం, రూ.40 వేలు ఉన్న ప్రయాణికుడి బ్యాగు మాయమైంది. వివరాల్లోకి వెళితే.. విజయనగరం నుంచి తిరుపతి వెళుతున్న మార్నింగ్ స్టార్ అనే ప్రైవేటు బస్సు బుధవారం రాత్రి 8.30 నుంచి 9 గంటల మధ్యలో జాతీయ రహదారిపై గండేపల్లి మండలం తాళ్లూరులో రోడ్డు పక్కనే ఉన్న ఒక దాబా వద్ద ఆగింది. భోజనాలు చేసేందుకు డ్రైవర్ బస్సును ఆపడంతో ప్రయాణికులందరూ దిగి వెళ్లారు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు బస్సులోని ఓ బ్యాగును తీసుకుపోయారు. దీన్ని కొందరు ప్రయాణికులు గుర్తించి కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అనంతరం దాబాలోని బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన ఓ ప్రయాణికుడు బస్సులోకి ఎక్కి, తన బ్యాగు కనిపించడం లేదని కంగారు పడ్డాడు. బ్యాగు చోరీకి గురైనట్టు గ్రహించి గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జగ్గంపేట, గండేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే బస్సు రాజమహేంద్రవరం వరకూ వెళ్లిపోవడంతో, దాన్ని వెనుకకు రప్పించారు. డ్రైవర్‌తో సహా ప్రయాణికుల వివరాలను నమోదు చేసుకుని బస్సును పంపించివేశారు.

పోలీసుల దర్యాప్తు

బ్యాగు తీసుకువస్తున్న ఆ వ్యక్తి నెల్లూరులోని ఒక సేటుకు చెందిన నగల దుకాణంలో పనిచేస్తుంటాడు. విజయనగరంలో రెడీమేడ్ నగలను దుకాణాలకు అందజేసి తిరిగి వస్తుండగా ఈ చోరీ జరిగింది. బ్యాగులో రూ.60 లక్షల విలువైన 600 గ్రాముల బంగారం, రూ.40 వేలు నగదు ఉంది. అయితే ఈ చోరీపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. బ్యాగు తీసుకువస్తున్న వ్యక్తిని విజయనగరం నుంచి ఎవరైనా ఫాలో అయ్యారా అనే విషయం తేలాల్సి ఉంది. బస్సును దాబా వద్ద నిలిపిన సమయంలో హైవేపై ఉన్న ఒక కారులో నుంచి వచ్చిన వ్యక్తులు ఈ బ్యాగును తీసుకుపోయినట్టు చెబుతున్నారు. ఆ దిశగా సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగ బాబు, సిబ్బంది దర్యాప్తు ముమ్మరం చేశారు.

పనితీరుతో ఉద్యోగులకు గుర్తింపు

- పంచాయతీరాజ్ కమిషనర్ ముత్యాలరాజు
- ఈటీసీలో ఎంపీడీఓల శిక్షణ పరిశీలన


ఈటీసీ ఆవరణను పరిశీలిస్తున్న కమిషనర్ ముత్యాలరాజు తదితరులు

సామర్లకోట: ఉద్యోగులు మంచి పనితీరుతో గుర్తింపు పొందవచ్చని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ కమిషనర్ రేవు ముత్యాలరావు అన్నారు. సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రానికి (ఈటీసీ) గురువారం ఆయన విచ్చేశారు. అక్కడ ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఎంపీడీఓలకు జరుగుతున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ముత్యాలరాజు మాట్లాడుతూ ప్రాధాన్య తాక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రతిచోటా ఎదురయ్యే సమస్యలను నైపుణ్యంతో సమర్థంగా అధిగమించాలన్నారు. అంతకు ముందు జరిగిన ఈటీసీ నిర్వహణ కమిటీ సమావేశానికి కమిషనర్ ముత్యాలరాజు అధ్యక్షత వహించారు. ఈటీసీలో జరుగుతున్న శిక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ కావాల్సిన అవసరాలపై ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. జీఎస్‌డబ్ల్యూ, వైద్యం, విద్య, ఇంజినీరింగ్ వంటి ఇతర శాఖల శిక్షణలు కూడా ఈటీసీలో జరిగేలా తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం విస్తరణ శిక్షణ కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, డీడీఓలు శ్రీనివాస్, విజయ భాస్కర్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ప్లీనరీ సెషన్‌లో 'ఆదిత్య' సతీష్ రెడ్డి



న్యూఢిల్లీ తాజ్ ప్యాలెస్‌లో ప్రముఖులతో ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో ఈ నెల 10న జరిగిన అఖిల భారత మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ప్లీనరీ సెషన్‌లో ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. పారిశ్రామిక, విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని, మేనేజ్‌మెంట్, వ్యాపార రంగాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారన్నారు. కార్యక్రమంలో నితిన్ అగ్రోలే (చీఫ్ స్ట్రాటజీ, కేపీఎంజీ), సంజయ్ కుమార్ సింగ్ (డైరెక్టర్, స్ట్రాటజీ, ఎక్స్‌టర్నల్ రిలేషన్స్, జిందాల్ స్టీల్ లిమిటెడ్), సంజయ్ నారాయణ్ (చీఫ్ జనరల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), తదితర ప్రముఖులు పాల్గొన్నారన్నారు.

ఉత్కంఠగా చెస్ ర్యాపిడ్, బ్లిట్జ్ పోటీలు


విజేతకు బహుమతి అందజేస్తున్న జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విక్టరీ అకాడమీలో గురువారం జిల్లా స్థాయిలో చెస్ ర్యాపిడ్, బ్లిట్జ్ పోటీలు ఉత్కంఠగా జరిగింది. ఈ జిల్లా చెస్ చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించి ర్యాపిడ్ విభాగంలో బండారు నానిబాబు ప్రథమ, ద్రాక్షారపు సాత్విక్ ద్వితీయ స్థానాలు, బ్లిట్జ్ విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ, పనిశెట్టి సాయి అవినాష్ ద్వితీయ స్థానాలు సాధించారు. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ మాట్లాడుతూ విజేతలు ఈ నెల 13 నుంచి నంద్యాలలో జరిగే రాష్ట్ర ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

తిరుమల విద్యాసంస్థల సిబ్బంది రక్తదానం


రక్తదానం చేసిన సిబ్బందిని అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు జన్మదినం సందర్భంగా గురువారం తిరుమల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాతేరులోని సంస్థ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఎన్‌టీఆర్ ట్రస్టు, డాక్టర్ వైఎస్సార్ అండ్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాలలో సుమారు 265 మంది తిరుమల సిబ్బంది రక్తదానం చేశారు. వారికి నున్న తిరుమలరావు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రక్తాన్ని డబ్బుతో కొనలేమని, వెల కట్టలేనిదన్నారు. ప్రపంచంలో మనిషి నుంచి మాత్రమే రక్తం లభిస్తుందన్నారు. ఒక వ్యక్తి తన జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తిరుమలరావు సోదరులు నున్న కృష్ణ, నున్న సురేష్, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ అండర్–19 విభాగానికి డాన్ బాస్కో హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆర్.పవన్ కుమార్, ఎ.వినయ్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ జె.విద్యాసాగర్ గురువారం తెలిపారు. కర్నూలులో ఈ నెల 22 నుంచి 24 వరకూ జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 10న జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలుర విభాగంలో జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిభ చూపారన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ నల్లగుంటకు చెందిన బాలిక ఈ నెల ఒకటో తేదీన పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికి బాలిక పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పది రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.

జూదరులకు జరిమానా

కిర్లంపూడి: పేకాట ఆడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వారిని గురువార ం ప్రత్తిపాడు కోర్టుకు హాజరు పర్చామన్నారు. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున జరిమానా విధించారన్నారు. మరోసారి పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అయోధ్యకు తరలిన విల్లు, బాణం



కపిలేశ్వరపురం (మండపేట): అయోధ్యలో నిర్మిస్తున్న కల్యాణ రాముని ఆలయానికి సమర్పించేందుకు దాత విల్లు, బాణం తయారీకి మండపేటలో ఆర్డర్ చేశారు. మండపేటలోని రామ కృష్ణా బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్స్ నిర్వాహకుడు, శిల్ప కళాకారుడు వాసా శ్రీనివాస్ గోల్డ్ కోటింగ్‌తో వీటిని రూపొందించారు. అయోధ్యకు చెందిన వంశవృక్షం అన్నదాన ట్రస్ట్ నిర్వాహకులు చల్లా శ్రీనివాస్ శాస్త్రి, గాయత్రి దంపతులు రూ.1.80 లక్షలతో తయారు చేయించారు. వాటిని గురువారం చల్లా శ్రీనివాస్ శాస్త్రి అయోధ్య నుంచి మండపేటకు వచ్చి తీసుకెళ్లారు. కళాకారుడు వాసా శ్రీనివాస్ నైపుణ్యాన్ని ఆయన ప్రసంశించారు.